# 3

## వాళ్ళు ముగ్గురు

[అక్కడొకటీ ఇక్కడొకటీగా దొరికిన రంగు కాగితాల ముక్కలనన్నిటిని జాగ్రత్తగా ఒకచోట చేర్చి వాటన్నిటిని సరైన క్రమంలో అతికించగలిగితే— ఏమో ఎవరికి తెలుసు— అదొక మహాచిత్రమవచ్చు. సరిగ్గా అతకడం చేతకాకపోతే వింత ఆకారమూ, వికారమైన రూపమూ తయారవచ్చు. అప్పుడది బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాకపోవచ్చు. ఏముక్క కాముక్క పెద్దచిక్కుగా, గొడవగా అనిపించవచ్చు.

జీవితమూ సరిగ్గా ఇంతేనేమో: అనుభవాలు, వ్యక్తులు, గుణాలు, పుస్తకాలు, మోసాలు, ఉపదేశాలు, అపార్థాలు,

అందాలు....క్షణక్షణమూ ఎదురయి వ్యక్తిని ఉక్కిరిబిక్కిరి చేసి, బెదరగొట్టేసి నడిసముద్రంమీద పడవలా చేస్తాయి. ఆస్థితిలో కావలసిన చుక్కాని ఒక ఫలానా దృక్పథం. ఆ దృక్పథానికి ప్రతినిధే ఈ కథలో లక్ష్మిపతి. అతని దృక్పథం సంపూర్ణంగా సరైనదా, అసలెక్కడైనా సరైనదా అంటే, కాక పోవచ్చు. కాని గజిబిజ ఆకారాలన్నిటికీ కలిపి ఒక అర్థం ఇచ్చినంతకాలం, ఒకదాని నొకటి ఎదిరించే లక్ష ప్రశ్నలకూ సమాధానాలకూ కలిపి సమగ్రంగా భాష్యం చెప్పగలిగినంతకాలం, వ్యక్తి మనసుకు నీడనూ చల్లదనాన్నీ ఇచ్చినంతకాలం ఆ దృక్పథం తన ప్రయోజనాన్ని సాధిస్తున్నదనే చెప్పాలి. ఎటొచ్చీ ఒక్కొక్క ఎత్తుకో మనిషికి ఒక్కో విధమైన నీడ కావలసి వస్తుంది గనుక, మనిషి పెరిగినకొద్దీ ఆ దృక్పథమూ విస్తరించగలదయితే అతడు దానిని సంపూర్ణంగా అంటిపెట్టుకోవడంలో తప్పు లేదనుకుంటాను.

ఇటువంటి విశ్వాసాని కొక రూపకల్పనే ఈ కథ. ఇందులోని రాజగోపాల్ పాత్రకు మాత్రం నాటకాలనుండి సినిమారంగానికి వెళ్ళిన మిత్రుడొకడు కొంత ఆధారం. మిగతా కథా, పాత్రలూ, సంఘటనలూ చాలావరకు కల్పితాలు. ఒకానొక భావం, లేదా అభిప్రాయం చెప్పడానికి కథకుడు తనకు అనుకూలమైన పాత్రలను, సన్నివేశాలను కల్పించి చెప్పే రకానికి చెందుతుందీ కథ. దాదాపు మూడేళ్ళపాటు నాలోపల దాగుడుమూత లాడిన ఈకథ ఆరంభించి ముగించడానికి నెలకుపైగా పట్టింది.]

అయిదు సంవత్సరాల క్రితం ఒకనాడు విజయవాడ స్టేషన్ చాలా కుతూహలంతో "ఊఁ" అనుకుంది - ఆ రోజు స్టేషనులో కలుసుకున్న ఇద్దరు మిత్రులను చూచి.

ఆ రోజున బందరు బండిలో - జనం క్రిక్కిరిసిన మూడో తరగతి పెట్టెలో కిటికీ ప్రక్కగా కూచుని లక్ష్మీపతి ఓపికగా వింటున్నాడు.

రాజగోపాలం చెప్పసాగాడు : " ఎనిమిదేళ్ళ నుండి జరిగిన మా నాన్నగారి ఆస్తివిషయం సుప్రీంకోర్టులో అనుకూలంగా అయిపోయిందోయ్... మా దాయాది రమణరావు చిత్తుగా ఓడిపోయాడు - ఇప్పుడు నాకిక బంధాలేవీ లేవు. హాయిగా, నా తనివి తీరా తెనుగు నాటకరంగానికి సేవచేస్తాను. డబ్బు కోసం, పేరుకోసం, నాలుగు పూలమాలల కోసం, పత్రికల్లో ఫోటోలకోసం తాపత్రయ పడే వర్తకుల్ని కాక నిజంగా కళా తృష్ణగల వాళ్ళని సమీకరిస్తాను. తెనుగు సాహిత్యంలోని అమూల్య రత్నాలను నాటకాలుగా ప్రదర్శిస్తాను. దేశమంతటా మన నాటకాలు విహరించేట్లు చూస్తాను " అంటూ సిగరెట్టుని గట్టిగా పీల్చాడు. సిగరెట్టు కొస - రాజగోపాలుడి ఉత్సాహంలా జ్వలించింది.

ప్లాట్‌ఫారం. ముహూర్తవేళ పెళ్ళిపందిరిలా ఉంది. పల్లెవాసులూ పట్న వాసులూ, ఫలహారాలూ, పళ్ళదినుసులూ వగైరాలన్నీ కలిసి కోలాహలంగా ఉంది. గడియారం మీది ముల్లు నియంతలా నిర్దాక్షిణ్యంగా ముందుకు వెళ్ళిపోతూంది.

బయట నిల్చున్న రాజగోపాలం మొహం చూశాడు లక్ష్మీపతి. ఆశయాన్ని సాధించ బూనడంలో ఉన్న ఆనందం అతడి మొహంమీద వెలుగుతూంది.

లక్ష్మీపతి తన చుట్టూ చూచుకున్నాడు. రెండు బూడిద గుమ్మడికాయల మీద తువ్వాలేసి ఆనుకుని చుట్టతాగుతున్న రైతు - బంగారం ముద్దలాటి ముక్కుపుడక తొడిగిన ఇల్లాలూ, పిల్లలూ - పత్రికమీద ఎండిపోయిన సిరాని భక్షిస్తున్న కళ్ళజోడు - చెమటకు తడిసిన చింపిరి చొక్కాతో తన ఉనికివి ఇతరుల కళ్ళకూ, ముక్కు

లకూ కూడా తెలియపరుస్తున్న కూలిమనిషి-పైన రెండు పెట్టెలు, ఒక సంచి, నాలుగు బుట్టలమధ్య ఒడుపుగా ఒళ్లు తీగలా మెలికలు తిప్పి పడుకుని నిద్రపోదామని చూస్తున్న ఆశావాదీ కాక ఇంకా ఎందరో ఉన్నారు.

చుట్ట పొగ కంపు కొడుతూంది, చెమటబొట్లు మెడమీద నుండి వీపుమీదికి పురుగుల్లా పాకుతున్నాయి.

అంతా ఇరుకు ఇరుకుగా ఉంది అనుకున్నాడు ఇంకా బయలుదేరని బండిలో కూచుని లక్ష్మీపతి.

అలా అనుకుని బయటకు చూశాడు. ఎత్తైన రిటైరింగ్ గదుల భవంతి, దాని ముందర క్రిందుగా రేకుల గొడుగు, ఈ ఏర్పాటుకు ముందు భాగాన—పెద్ద సెట్టింగు ముందు రాజకుమారుడిలా—గాలిలో, వెలుతురులో, ఇరుకులేకుండా విశ్రాంతిగా నిల్చున్న రాజగోపాలం తను హైదరాబాదు వెళ్ళి చెయ్యబోయే వెయ్యి పనులను గురించి అతి ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు. కళని అర్థం చేసుకుని దానికోసం బ్రతికి, దానికోసమే మరణించే అదృష్టం ఎందరి కొస్తుందీ అని అడుగుతున్నాడు. అతడి స్వరం పున్నమి సముద్రంలా ఉంది చిన్నప్పుడు బళ్లోనూ రాజు ఇంతే. ఎప్పుడూ ఎలెక్షన్లు, నాటకాలు, సంఘాలు అంటూ హడావిడిగా తిరిగేవాడు.

బండికి వేళయింది.

పొట్టిగా ఉన్న బట్టతల గార్డు ఈలవేసేసరికి ఇంజనుకు కోపం వచ్చి అరిచింది. చక్రాలు మూలుగుతూ నిద్రలేచాయి. బండి కదిలింది.

రాజు చెయ్యి ఊపాడు: "ఇంటర్వ్యూ బాగా చెయ్యోయ్ . '' అన్నాడు.

తల ఊపాడు లక్ష్మీపతి—బందరులో ఒకానొక గుమాస్తాగిరి ఇంటర్వ్యూకు వెళ్తున్న లక్ష్మీపతి. నాలుగయిదు అల్లాటప్పా ఉద్యోగాల తర్వాత ఈ నాడు అతడికి కేంద్రప్రభుత్వంవాళ్ళు ఉద్యోగం ఇస్తామన్నారు. అంటే నెలకు తొంభై రెండు రూపాయలకు బదులు వందాపాతిక వస్తాయన్న మాట! ఈ అదృష్టమంతా మొన్న జూన్‌లో

పుట్టిన మూడో పిల్ల దుర్గదే అంటుంటుంది శ్రీమతి లక్ష్మీపతి. అది విన్నప్పుడెల్లా నవ్వుతాడు శ్రీయుత లక్ష్మీపతి.

రైలుతో పోటీ పడలేక ప్లాటుఫారం ఆగిపోయింది.

కిటికీలో నుండి తొంగి చూశాడు లక్ష్మీపతి.

రాజగోపాలుడి వాచీ గొలుసు మెరుస్తూంది. చిన్నప్పుడు ఏడేళ్ళు కలిసి చదివిన అనుబంధం లక్ష్మీపతి చేతిని కూడా ఊపింది- విజయవాడ ప్లాట్‌ఫారం దూరమయి పోయినప్పటికీ....

సీట్లో కూచున్న లక్ష్మీపతికి ఎదుట కూచున్న రైతు నోట్లోని చుట్ట అయిపోయి ఉండటం కనబడింది. 'అమ్మయ్య' అనుకున్నాడు.

ఆ రైతు రొండిలోంచి అగ్గిపెట్టె తీశాడు. ఇంజను వదిలిన పొగ గుప్పుమని కిటికీ గుండా వచ్చి సోకింది. కిటికీ ప్రక్కనే కూచున్న లక్ష్మీపతి కన్ను కరకరమంది.

అరఘంట తర్వాత వాల్తేరునుండి విజయవాడ చేరిం దొక రైలుబండి. ఆ బండి లక్ష్మీపతికొక ఉత్తరాన్ని మోసుకొచ్చింది.

కొత్తపేటలో తమ ఇంట్లో ఉన్న శ్రీమతి లక్ష్మీపతి ఆ ఉత్త రాన్ని చదువుతున్న సమయానికి—రాజగోపాలం తన హైదరాబాదు రిజర్వేషన్ గురించి ఎవరో రైల్వే యూనిఫారాన్ని అడుగు తున్నాడు.

—ఆ ఉత్తరం చదివింది శ్రీమతి లక్ష్మీపతి.

'మా గోపీ—మా గోపీ అంటుంటారు ఆయన... ఇతడిని గురించే కాబోలు... ఇతడంతా ఏదో కథల్లో మనిషిలా ఉన్నాడు... వైద్యం చేస్తాడుట. కాని డబ్బక్కర్లేదట. పేరూ వద్దట. ప్రజలకు సాయం చేయడం కన్న జీవితంలో వేరే దైవమే లేదుట... చాలా విచిత్రమైన మనిషే... ఆయన స్నేహితులందరూ పెద్దపెద్ద ఉద్యో గాల్లో ఉన్నారు... కాని ఆయనొక్కడే చాలీ చాలని ఉద్యోగంతో కష్టపడుతున్నారు... అదంతా తన దురదృష్టమే. తన్ను పెళ్ళి చేసుకున్నారు. దమ్మిడీ కట్నం పుచ్చుకోలేదు! సాటివాళ్ళు అనుభ వించే చిన్న చిన్న సుఖా లెన్నిటినో తనకోసం వదులుకున్నారు... తనవల్లే ఆయన కష్టమంతాను.. అయినా ఆయన తొణకరు. పల్లెత్తు

మాట అనరు. ఏది చెప్పినా—"మనకేం తక్కువ పార్వతీ" అంటారు. నవ్వుతారు. ప్రమిద వెలుగులా ఉంటుంది ఆయన నవ్వితే-' అనుకుంటూ చేతిలో ఉన్న కార్డుని గూట్లో ఉంచి, దేవుడి దీపం వెలిగించడానికి వెళ్ళింది పార్వతి.

రాజరాజేశ్వరీదేవికి ప్రణమిల్లుతూ - "అమ్మా : ఆయన వెళ్ళిన పనిని దీవించు " అనుకుంది.

ఇలా దేవుడికి ఒక వంక నమస్కారం పెడుతూ, ఇంకో వంక 'ఏదయినా అడిగితే అది భక్తి కాదుట, అది వేరమాద్దమట— అంటారాయన' అనుకుంది పార్వతి.

ఈలోగా దుర్గ ఏడిస్తే ఉయ్యాల దగ్గరకు వెళ్ళింది. పాపాయిని చేత్తో తీసుకుంటుండగా, చేయి తగిలి ఉయ్యాల చీరెలోని చిరుగు పెద్దదయింది.

దుర్గకు పాలిస్తూ అనుకుంది పార్వతి - సాయంకాలమనగా వెళ్ళారు ఆటలకని, ఆ బాబుగాడూ, గీతా ...ఇంకా రాలేదింటికి.

* * *

రాత్రివేళ.

దూరంగా సినిమా డేరాలోంచి కృష్ణుడు కాబోలు బహుశ కుచేలుడితో పద్యమూ పేజా ఏదో చెప్పేస్తున్నాడు 'మోహన'లో. ఆ 'భక్త కుచేల' సినిమా వచ్చి మూడు వారాలయింది కాని ఇంకా సగం గ్రామం అక్కడే ఉంటుంది రోజూ రాత్రివేళ. ఆ బూజుపట్టిన కథమీద ఇంత మోజెందుకో? అవతలి దేశంవాళ్ళు అంగారకుడి లోకి మనుషుల్ని పంపుతుంటే మనవాళ్ళింకా బురదల్లో దిగబడి పోతారేవిటి? వీళ్ళందరూ నిజాలను ఎప్పుడు తెలుసుకునేది? ఎప్పుడు వీళ్ళందరూ మానవులుగా, వర్తమానంలో జీవించేది? అనుకున్నాడు తన పెంకుటింటి దొడ్డివైపు, మంచంమీద పడుకున్న డాక్టర్ గోపీనాథ్.

నక్షత్రాలను తరుముకుంటూ వెళ్తున్నాడు చంద్రుడు... ఆకాశం అందంగా, అనంతంగా ఉంది. అమాంతం ఎగిరి పోగలిగితే ఎంత బాగుండునో! అవును, అదీ ప్రయత్నిస్తున్నారుగా శాస్త్ర

జ్ఞులు! ఇంకో పదేళ్ళలో చంద్రుడూ, బుధుడూ అందరూ తెనాలీ గుంటూరుల్లా అయిపోరూ? ఆకాశం చూచినప్పుడెల్లా తనకిలా అనిపిస్తుందా, ఆ లక్ష్మీపతి గాడున్నాడే, వాడికి ఆకాశం క్రిందగాని, సముద్రపు ఒడ్డునగాని ఒంటరిగా నిల్చున్నప్పుడు తన అల్పత్వం గోచరిస్తుందట. ఏం మనిషో? ఏవయినా సరే తమ్ము తామెందుకు కించ పరచుకోవాలో అర్థంకాదు. మనిషి మనసు పెద్దపెద్ద అంగలతో ప్రకృతి దాచుకున్న రహస్యాలను తెలుసుకుంటుంది. క్రమంగా ప్రకృతిని వశ్యం చేసుకుంటున్న మేధావి మానవుడు! అలాంటివాడు అల్పు డెట్లా అవుతాడు...? అలాగని పదార్థ విజ్ఞానానికి మానవత లోకువయి పోకూడదు. చుట్టూ ఉన్న శక్తుల్ని తెలుసుకుని మనిషి నిజంగా, నిండుగా, మనిషిగా జీవిస్తే ఇంక వేరే దేవుడెవరు?

పెద్దగా చప్పట్ల వర్షం.. సినిమా డేరానుంచే!

నిద్ర రావడం లేదు. పడక మీదనుండి లేచాడు గోపీనాథ్. వీధి గడియ తీసి వసారాలో నిల్చున్నాడు. ఇంటి ముందున్న వేప చెట్టు చీకటిపలకమీద వెన్నెలతో ఓనమాలు దిద్దుతూంది. ఎదురింటి కృష్ణయ్యగారి ఆవు తీవిగా పడుకుని నెమరు వేస్తూంది.

వాచీని అడిగితే పదకొండని చెప్పింది. ఇంకోగంట దాటితే గాని సినిమా అయిపోదు. అనుకుంటూ లోపలికి నడిచాడు గోపి.

హాల్లో లాంతరు వత్తిని పెద్ద చేశాడు. డ్రాయర్‌లో నుంచి డైరీ తీశాడు. డైరీ మధ్య ఉంది కాబోలు, ఉత్తరం క్రింద పడింది.

'నా ఉద్యోగం ఫర్వాలేదు. బాగానే ఉంది. ఎటొచ్చీ మా దొరవారికి కాస్త కులాల పట్టింపు ఎక్కువ. అదే కాస్త ఇబ్బంది.

....ఇంకేవిటి కబుర్లు? నీ డిస్పెన్సరీ బాగా సాగుతూందా? మీ అమ్మగారినుండి ఉత్తరాలు వస్తున్నాయా? ఆమెకు నా నమస్కారా లందజెయి.

....అన్నట్లు మా మూడో అమ్మాయి దుర్గ మొన్న దీపావళి నాడు ప్రమాదవశాత్తూ బట్టలకు నిప్పంటుకోవడం వలన మమ్మల్ని విడిచి వెళ్ళిపోయింది.

'....ఈ రెండేళ్ళల్లో రాజగోపాలం హైదరాబాదులో చాలా పెద్దవాడయి పోయాడట. మంత్రులు మేయర్లు పత్రికా సంపాదకులు అందరూ వాడి మిత్రులేనట. వాడు స్థాపించిన 'కళాలయం' వాళ్ళు తిమ్మరుసు నాటకం చాల బాగా వేశారట. వాళ్ళ బృందంలో అతి అద్భుతంగా నటించే అమ్మాయి ఒకతె ఉండిందిట.... రాజు ఆశయానికి ఆమె ఊపిరట! ఈ కబుర్లన్నీ హైదరాబాదునుండి వచ్చిన మా బాబాయి కొడుకు రామం (ఆ। అవును.... ఆ బటతలవాడే....) చెప్పాడు. మరి, రాజుకు ఉత్తరాలు వ్రాసే అలవాటు లేనేలేదు. నేను వ్రాయకపోయినా నువ్వన్నా వ్రాస్తూ ఉండు.... నాకు వ్రాయాలనే ఉంటుంది కాని పోస్టాఫీసుల్లో కవర్లు ఉత్తినే ఇవ్వరుగా!'

....అంటూ వ్రాశాడు లక్ష్మీపతి.... ఏం మనిషి వాడు! దుర్గంటే వాడిప్రాణం. అది పుట్టింతర్వాతే వాడి కీ కొత్త ఉద్యోగం దొరికింది. ఈ రెండేళ్ళనుండి కాస్త బాగుపడ్డాడు కదా అనుకుంటుంటే ఆ అమ్మాయి చనిపోవడమా... అయినా దాన్ని గురించి వాడు వ్రాసిన పద్ధతేమిటి? అదేదో తాళాలగుత్తి పోయినట్లువ్రాస్తాడేం- అనుకున్నాడు గోపీ.

ఆలోచిస్తూ ఆలోచిస్తూ డైరీలో పాతపేజీలు తిరగవేశాడు.

అయిదు నెలల క్రిందటి ఒక పేజీమీద ఆగింది దృష్టి.

'ధనమ్మ' - అని వ్రాసి ఉంది. గోపీ మనసు వెనక్కు ఎగిరింది....

నిజంగా ధనమ్మే! మొగుడుపోయి ఎనిమిదేళ్ళయినా మొగరాయుడిలా ఇరవై ఎకరాల పొలాన్ని ఎంతో నేర్పుగా నడిపిస్తూంది. నిజంగా తన డిస్పెన్సరీని త నలా నడపలేక పోతున్నాడు. రెండేళ్ళుగా తను గ్రామంలో ఉంటున్నా ఆవిడను గుర్తించింది మాత్రం ఎనిమిది నెలల క్రిందనే. పేడమీద కాలువేసి జారిపడ్డందున ఆమె మోకాటి చిప్ప తొలగింది. తన్ను పిలిపించారు. ధనమ్మది మంచి ఆరోగ్య మయిన శరీరం అవడంవల్ల ఒక నెలలోనే ఆమె మోకాలు బాగయింది.... తర్వాత వారానికోసారయినా వచ్చి కూచునేది తలనొప్పనీ దగ్గనీ.... గంటల తరబడి ఏవేవో చెప్పేది.... లేచి వెళ్ళమని చెప్పడం ఎలాగ....

చేతుల్లోంచి జారి డైరీ క్రింద పడింది. ఆలోచనల నుండి మేల్కొన్న గోపీనాథ్ అయిదు నెలల క్రింది ఆ పేజీ చదివాడు.

"ధనమ్మ నేడు నన్ను పిలిపించింది. రాత్రి భోజనం అయిం తర్వాత వెళ్ళాను. ధనమ్మ తమలపాకులు వేసుకుంటూంది.

"రా పంతులూ, కూర్చో." అంది. తాంబూలం ఇచ్చింది. వద్దన్నాను.

"ఏం పరాయి ఆడది స్తే వేసుకోవా?" అని నవ్వింది. అక్కడినుండి లేచివచ్చేద్దా మనిపించింది.

"ఎందుకు పిలిపించారు?"

"పనుండి."

"ఏం పనో చెప్పండి."

"అంత తొందరయితే ఎట్లాగయ్యా డాక్టరూ" అని తెల్లచీర పవిటతో విసురుకుంది.... మల్లురవిక.... నలబైయో పడిలో పడి నట్లు తెలియని ఒళ్ళు.

"నాకు వేరే పనుందండీ-" చిరాకును తొక్కిపట్టగలిగాను.

"నీకు పోస్టులో ఏదో మందుల పెట్టె వచ్చిందటగా మొన్న....?"

నేనేమీ పలక లేదు.

"దానికి రెండు వేలో ఎంతో కట్టాలిటగా?"

"అవును, రేపో ఎల్లుండో తీసుకుంటాను. మీరు పిలిపించిన పనేవిఁటో చెప్పండి."

"అదే.... ఆ రెండువేలూ నేనిస్తాను, మందులు తీసుకో రాదూ?"

"మీ సాయానికి కృతజ్ఞుణ్ణి.... నా డబ్బున్న బ్యాంకి దివాలా తీయడంవల్ల కొంత ఇబ్బంది అయింది. డబ్బు రాగానే మీకిచ్చే స్తాను...."

"అబ్బే.... ఆడదానికి - నాకు డబ్బెందుకయ్యా డాక్టరూ?" అని ధనమ్మ చూచిన చూపును నేను ఎదుర్కోలేక పోయాను. అర్థ మయింది!

"వస్తానండీ.... మీ డబ్బు నాకఖ్ఖర్లేదు." అని వచ్చేస్తుంటే-
"పంతులూ, తొందరపడమాక. ధనమ్మ అందరినీ పిలవదు-"
అనడం వినిపించింది.

ఛీ.... నీచురాలు! పెద్ద రైతు చలమయ్యనీ, పాలేరు రంగయ్యనీ తన గుప్పిట్లో ఉంచుకున్నది చాలక, నన్ను డబ్బుతో కొందామనా?

ఏమి టీ మనుష్యులు? నేను అష్టకష్టాలూ పడి వాళ్ళందరికీ మంచి చేద్దామని వచ్చాను. నా చదువంతా వీళ్ళ ఆరోగ్యానికోసం వెచ్చిద్దామని సిద్ధమయ్యాను. కాని ..."

-అని ముగిసింది డైరీలో అయిదు నెలల క్రింది ఆ రోజు.

ధనమ్మలాటిది కాదు శారద.... శారద చిన్నది. నాన్న లేడు. ఎక్కువ చదువుకున్నట్లు లేదు. కాని అలంకరణ మాత్రం. పిచ్చి పిచ్చిగా, పట్నవాసం పిల్లల్లా చేసుకుంటుంది. తన దగ్గరికి మాటి మాటికీ ఏ తమ్ముణ్ణో తీసుకొస్తుంది.... సరిగా మాట్లాడదు.... బోలెడు సిగ్గు పడిపోతుంది.... ఎందుకలా చేస్తుం దా అమ్మాయి.... ఆమె గనుక నర్సయితే రోగులకు ఎంతో బాగుంటుంది....

-అనుకుంటూ అవాళ్టి డైరీ రాయడం మొదలెట్టాడు.

"....ఇవాళ చాలా మంచి దినం....ఆరు మైళ్ళ వతల ఉన్న పల్లెపాలెంలో ఒక ముసలాడు-గుండెజబ్బుట-ఇంకో గంట ఆలస్యమయితే చచ్చిపోయేవాడు....కాని బ్రతికాడు। వచ్చేస్తుంటే దారిలో టీచర్ రామాచార్లు కనుపించి వద్దన్న కొద్దీ అరటిపండ్ల గెల ఒకటి పంపాడు మనిషితో.... ఎప్పుడో వాళ్ళావిడకు పంటినొప్పి వస్తే మందిచ్చాను. ఆ అభిమానం! ఇంతకన్నా ఏం కావాలి నాకు అని పిస్తుంది.... సాయంకాలం ఆ 'బెస్టు' చేస్తుంటే తిరుపతి వచ్చాడు. తిరుపతి కమ్యూనిటీ రేడియోలాటి వాడు.... అవీ ఇవీ చెప్పి.... "శారద ఊరు విడిచి వెళ్ళిపోయిందిటండీ-" అన్నాడు. శారద.... అమాయకంగా కనబడే శారద - ఆమె అంతరంగంలో ఏముందో? ఎక్కడికి వెళ్ళింది - ఎందుకూ?.... ఏమో.... చెరువుక్రింది పొలంలో రామావతారంగారి పంట కుప్పలు రాత్రి తగలబడి పోయాయట. అదీ తిరుపతి భోగట్టాయే.... పోయిన వారం ఎప్పుడో కనకాచలం పెళ్ళాం స్నానానికని చెరువుకు వెళ్తే రామావతారం ఆమె

చెయ్యి పట్టుకున్నాట్ట - అని కూడా ప్రసారం చేశాడు తిరుపతి.... ఏమిటి ఈ గ్రామాలు ! అమాయకత్వమూ ఆనందమూ ఎక్కడ? ఆకు పచ్చటి ప్రకృతి మధ్య ఈ అత్యాచారా లేవిటి? ఎక్కడి దీ అపశ్రుతి-?''

....డైరీ ఇంకా రాసుకుంటూండగానే.... పెద్దగా విమర్శలు చేస్తూ, కూని రాగాలు తీస్తూ సినిమా చూసిన కుబేరులూ, కుచేలులూ తిరిగి రావడం వినిపించింది.

*　　*　　*

'కళాలయం' వాళ్ళ రిహార్సల్సు చూచి వద్దాముటోయ్....'' అన్నాడు రిపోర్టరు శివరాం.

''ఊఁ, పద !'' అన్నాడు రమ్రావు.

''అందులో ఆ రాజగోపాల్ ఉన్నాడే చాలా అద్భుతమయిన వ్యక్తి.... అతడికి నాటకాలంటే ప్రాణం సుమీ! నువ్వు అతడిని హత్య చెయ్యాలి అనుకుంటే - ''అబ్బీ ! నువ్వు నాటకాలు వేయ డానికి వీల్లేదు-'' అని శాసనం చేయించేస్తే అతడు తాప్పున చచ్చి పోతాడు. అంత పిచ్చి అతడికి....''

''అబ్బా !''

''నిజంగానోయ్.... అతడు నటిస్తుండగా చూడడానికి రెండు కళ్లూ చాలవోయ్....''

''అవున్ట - 'తిమ్మరుసు' నాటకంలో అప్పాజీగా చాలా గొప్పగా చేశాట్ట.... మద్రాసులో మా ఫీల్డులోనూ అనుకున్నారు-''

''ఆఁ...! మీ ఫీల్...డు !!'' అని వెక్కిరించాడు శివరాం.

''ఆ... అదే వద్దన్నదీ .. తెనుగు సినిమాలంటే అందరికీ లోకువే కదా .. అబ్బీ శివరాముడూ ! సినిమా తీయడం అంటే— "కన్రయ్యగారి సభకు తొమ్మిదన్నర మంది ఎచ్చారు'....లేదా 'దుంప య్యగారి ఎనభై రెండో పుట్టిన రోజు—' అని కల్లబొల్లి కబుర్లు రాయడం కాదుస్మీ—''

''సరేలేవోయ్.... మీ సినిమా వాళ్ళందరూ గొప్ప కళా స్రష్టలు? సరేనా.... చార్లీ చాప్లినూ, సత్యజిత్‌రాయీ అందరూ తెనుగు సినిమాలు చూసే అన్నీ నేర్చుకుంటారు—అవునా''

"ఆపవోయ్.... నీ బోడి వ్యంగ్యమూ నువ్వూనూ"

బస్‌స్టాండ్ చేరారు మిత్రులు.

'నటన భారతి' హాల్లోకి వెళ్ళారు. కళాలయం మేనేజరు బలభద్రం శివరాంని పలకరించి బాల్కనీలో కూచోపెట్టాడు. రిహార్సల్సప్పుడు రంగానికి దగ్గరగా బయటివారు ఎవరన్నా కనబడితే రాజగోపాలం చిందులు తొక్కుతాడట....

'మాలపల్లి' నాటకం రిహార్సల్సు చూచి, అరఘంట తర్వాత లేచారు....

వెనక్కొస్తుండగా—"అతడా రాజగోపాల్ అంటే?" అని తన సందేహాన్ని తానే తీర్చుకుంటున్నట్లు అన్నాడు రమణారావు.

"అవును.... అతడే.... తెలుగు వాళ్ల గర్వించదగిన మనిషి—" అన్నాడు శివరాం.

"ఆ.... అమ్మాయి....అదే....చెంపకుచేరెడేసికళ్ళ అమ్మాయి ఎవరూ?—"

"ఆ పిల్ల సంధ్య. రాజగోపాలుడి ప్రాణమోయ్.... పదినెల్ల క్రింద ఏ పల్లెటూరి నుంచో వచ్చిందట.... ఆ మట్టిముద్దను గొప్ప నటీమణిగా తయారుచేశాడు రాజగోపాల్...." అన్నాడు శివరాం.

రమణారావేమీ పలకలేదు.

* * *

"డైరీ రాసి మూడు వారాలయింది.... ఈ మూడు వారాలూ ఎంత భయంకరమైనవి? హోరా హోరి పోరాటం చెయ్యాల్సి వచ్చింది.... ఉన్నట్లుండి ఊళ్లో కలరా విజృంభించింది.... చాలా మంది చచ్చిపోయారు.... నేను నా శాయశక్తులా పోరాడాను. కాని ఒక్కడినీ ఎంతని చేయగలను.... పాపం రామాచార్లుగారి భార్య పోయింది. చలమయ్య పోయాడు.... కృష్ణయ్యగారి పిల్లలిద్దరూ ఇకలేరు....

—ఇంత బీభత్సంలోనూ మనుషులు మనుష్యులుగా ఉండలేరుకదా—పది రోజుల క్రింద బజారు వీధిలో గోడమీద—

రంగి.... నా ఇల్లు చిమ్మే మనిషి.... పేరు, నా పేరు కలిపి వ్రాసి ఉన్నాయి.... అది చూసిన క్షణం కళ్ళు తిరిగాయి—తల కొట్టేసినట్లయింది—ఎవరో వెంటబడి తరుముతున్నట్లు, రెండు వేల రూపాయల కట్టలతో కొడుతున్నట్లు అనిపించింది....వీళ్లా మనుష్యులు... కృతజ్ఞత లేకపోగా ఇట్లా బాధించడమా... నేను కృతజ్ఞతకూడా అడగలేదే! కాని...కాని... హుం! ఇలాటి వాటికి బెదరకూడదు ..

ఇంకో భయంకరమైన సంఘటన .. ఇవాళ తెల్లవారుజామున నాల్గింటికి నన్నెవరో వచ్చి లేపారు. తీరా వెళ్ళి చూస్తే కనకాచలం రక్తపు మడుగులో పడి ఉన్నాడు! కనకాచలం పెళ్ళాం పుట్టింటి కెళ్ళింది .. అతగాడి కొడుకు లిద్దరూ ట్రాక్టర్ కొనడానికని మద్రాసు వెళ్ళారట... అని మొన్ననగా మొన్న సాయంకాలం కనకాచలమేఁ సాలెవీథిలో కనుపించి చెప్పాడు! అత డివాళ ఇలా కనుపించాడు .. అతడి తలమీద ఏదో ఆయుధంతో వెనకనుండి మోదినట్లుంది. అయినా కనకాచలం గట్టిపిండం .. చావలేదు. కాని ఇంకో నాలుగు రోజులదాకా ఏమీ చెప్పలేము. అతడిని హాస్పిటల్‌లో చేరిస్తే బాగుండును. కాని కదల్చరాని పరిస్థితి .. నా పడకగదిలో ఉంచాను .. నాకు తెలిసిందంతా చేస్తున్నాను... చూడాలి.

.. అన్నట్లు ఆర్నెల్ల క్రింద తిరుపతి చెప్పాడే... చెరువుగట్టు క్రింది పొలంలో కుప్పలు తగలడ్డాయని . దానికీ, దీనికీ ? ఏమో—డాక్టరుగా నేను నా రిపోర్టు వ్రాయాలి! కాని, ఇలా బ్రద్దలయిన తలల గురించి రిపోర్టు వ్రాయడానికా నేనీ మారుమూల గ్రామానికి వచ్చిందీ! చేతుల్లోంచి ఏదో జారిపోతున్నట్లున్న అశాంతి కోసమా నేను వచ్చిందీ ఏదో లోపిస్తూంది. ఏమిఁటి అది ?..."

—అని డైరీ వ్రాసుకుంటున్న గోపీ చెవులకు వీథి తలుపు తట్టిన చప్పుడు వినిపించింది.

ఏమిఁటివాళ... ఇంకో హత్యా ప్రయత్నంకాదు కదా...అనుకుంటూ తలుపు తెరిచాడు—చేతిలో టార్చీతో —

ఎవ్వరూ లేరు!

చల్లగాలి ఒక్కసారిగా లోపలికి వీచింది. రెపరెపమని నేల మీద చప్పుడయినట్లయితే గోపీ క్రిందకు చూచాడు.

ఆశ్చర్యం !!

ఒక కాగితం పడి ఉంది.

వంగి దాన్ని తీసుకున్నాడు.

తలుపులు వేసి, లోపలి కొచ్చి చూశాడు.

ఒక్క క్షణం అతడి గుండె ఆగింది.

'కనకాచలం బ్రతకకూడదు—'అని పెన్సిలుతో వ్రాసిఉంది.

'బ్రతకకూడదు.'

శాసనంలా ఉంది.

ఎవ రా శాసించేది ??

చావుతో చివరివాకా పోరాడ్డం డాక్టరుగా తన విధి. తన కర్తవ్యం నిర్వహించకుండా శాసించగలవాళ్ళెవళ్ళు !

ఒక్కసారి తను కూచుని ఉన్న హాలంతా కలయజూశాడు గోపీ. గోడమీద తన ముక్కు సీడ చాలా వికృతంగా పడి ఉంది.

మళ్ళీ తలుపు తట్టినట్లయింది.. కాళ్ళు తొట్రు పడ్డాయి.... అబ్బే... అవి గాలి ..పడగది కిటికీ చప్పుడు. పెద్దగా రేడియో పెట్టుకుంటే బాగుండును...అబ్బే...అవతల గదిలో కనకాచలం స్పృహ తప్పి పడి ఉన్నాడు .. గంటపన్నెండవబోతూంది. అతడిని వెళ్ళి చూడాలి.

—అనుకున్న గోపీకి హఠాత్తుగా స్ఫురించింది. ఆ రోజు రోజెల్లా చలపతితో తానొక్కడే ఉన్నాడుగాని—ఇంకెవ్వరూ— ఎవ్వరూ—ఎవ్వరూ రాలేదు తనింటికి...

తాను ఒంటరి !

* * *

హిమాయత్ నగర్‌లో 'కళాలయ' వారి బంగళా హడావిడిగా ఉంది. వాకిట నాలుగయిదు కార్లు నిలిచి ఉన్నాయి. రాత్రింబవళ్ళు నిర్విరామంగా కృషి జరుగుతూంది. ఎల్లుండి 'మాలపల్లి' నాటక ప్రదర్శన. తెలుగు నాటక చరిత్రలో గొప్పరోజు. రాజగోపాల్ కళ్ళు విప్పుల్లా మెరుస్తున్నాయి. ఎక్కడ చూచినా తనే అయి అన్ని

పనులూ చూస్తున్నాడు. అందరినీ శాసిస్తున్నాడు. ఎల్లుండి ఉదయం ఢిల్లీనుండి మంత్రిగారు వస్తున్నారు. ఆయన సమక్షాన నాటక ప్రదర్శన.

మధ్య మధ్య రిపోర్టర్ల గొడవ—ఏదో ఇంటర్వ్యూ అంటారు.. ఫోటో లంటారు "యాభైమూపాయల టిక్కెట్లు అయి పోయాయండోయ్!—" అంటూ వస్తాడు మేనేజర్ బలభద్రం— "లైసెన్సా; నీకు లైసెన్సెందుకోయ్.. నువ్వు మా హైదరా బాదులో నాటకం వేయడమే మా అదృష్టం" అని వీపు తడతా డొక పోలీసు పెద్ద. "నాకు ఆరు టిక్కెట్లు—ఆ! ఆరు టిక్కెట్లు రిజర్వు చేయించవోయ్"— అని ఫోను చేస్తాడు నాయకుడుగారి పి. ఎ.

అన్నీ, ఇవన్నీకూడా ఎదుర్కొని తన జీవితంలోకెల్లా పెద్ద పరీక్షా సమయంలాంటి ఆ రోజుకోసం తపస్సు చేస్తున్నాడు రాజ గోపాల్.

కడుపులో ఏదోగా ఉందనిపించింది రాజుకి. నవ్వొచ్చింది. నిన్న సాయంకాలం నుండి ఏమీ తిననేలేదు. - మధ్యమధ్య ఆ వెధవ 'టీ' నీళ్ల తప్ప. ఇరవైనాలుగ్గంటలూ ఉపవాసమే! లక్ష్మీపతి లెక్క ప్రకారం అయితే, చాలా మంచిపని చేశానన్న మాట-అనుకున్నాడు రాజు. నవ్వొచ్చింది.

—అన్నట్లు లక్ష్మీపతినీ గోపినీ టిక్కెట్లు పంపుతూ నాటకా నికి ఆహ్వానించమని బలభద్రంతో చెప్పినట్లు గుర్తు....అత డాపని చేశాడో లేదో.... "రెండు కాంప్లిమెంటరీలే! రెండువందల రూపా యలు మేస్తారూ-" అన్నాడు బలభద్రం.... అతడి కెప్పుడూ డబ్బే లోకం.... అయినా తన ఈ గొప్ప ప్రయత్నం రూపురేఖలు దాల్చి ప్రత్యక్షమయే ఆ క్షణాన ఆ సంతోషాన్ని పంచుకోవడానికి లక్ష్మీ పతీ, గోపీ ఉండి తీరాలి.... లక్ష్మీపతి! పాపం, ఆ చాలీ చాలని ఉద్యోగం. సంసారం.... బురదలో కూరుకు పోయాడు.... తెలివి గలవాడు!.... ఈ నాటకం అయిం తర్వాత ఏ మంత్రిగారితోనో చెప్పి వాడికేదయినా సాయం చెయ్యాలి.

—అనుకుంటూ.... ఓ గంట విశ్రాంతిగా ఉండాలని ఎవరి తోనూ చెప్పకుండా నడిచి చార్మినార్ దాకా వెళ్ళిపోయాడు రాజు...

వెళ్ళి వెళ్ళి ఒక హోటల్లోకి దూరి కడుపునిండా తిన్నాడు... నాలుగు న్నర రూపాయలయిందన్నాడు హోటలువాడు. డబ్బు ఇచ్చేశాడు.

వాచీ చూస్తే ఎనిమిదవ్వొస్తూంది. విద్యుద్దీపాల కాంతిలో నగరం మేకప్ చేసుకున్న నటి వయస్కురాలిలా ఉంది... ఆ వేళ ప్పుడు బజారు రొదగా, సొదగా, గుమాస్తా జీవితంలా - మూడో తరగతి రైలు ప్రయాణంలా - హిందీ వ్యాకరణంలా ఉంది.

టాక్సీని కేకేశాడు రాజు.

'కళాలయం' చేరాడు. టాక్సీ వాడికి డబ్బులిచ్చాడు.

ఇంట్లోపల దీపాలన్నీ వెలుగుతున్నాయి. సిగరెట్ల పొగల మధ్య వాదోపవాదాల సెగలు రాజుకుంటున్నాయి. పరీక్ష హాల్లోకి వెళ్ళడానికి కాచుకున్నవారిలా ఉన్నారు సభ్యులు.

గబగబ మెట్లెక్కి సంధ్య గదిలోకి వెళ్ళాడు రాజు.

తలుపు తట్టాడు. ఒక నిముషం ఆగి తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాడు.

సంధ్య అక్కడ లేదు.

ఎల్లుండి నాటకం అనగా ఈవేళ ఇలా తిరగడం ఏమిటి! తనతో చెప్పకుండా ఎక్కడకు వెళ్ళింది చెప్మా! ..

మామూలుగాతనతో చెప్పిగాని—అన్నట్టు మధ్యాహ్నంభోజనాల దగ్గర చూశాడు, అప్పుడూ-అప్పే లేదు. తను మధ్యాహ్నం భోజనం చెయ్యందే...ఆ మూల, ఆ మూల సూట్ కేసుండాలి ఏదీ ?

టేబుల్ మీద తను కొనిపెట్టిన వాచీ - పల్లెటూరినుండి పరు గెత్తుకొచ్చిన శారదని సంధ్యగా చేసిన తను, పల్లెపిల్లను ఉత్తమ నటిగా తయారు చేసిన తను - తను కొనిచ్చిన వాచీ టేబిల్ మీద ఉంది. సంధ్య దానిని క్షణంకూడా విడిచి ఉండదే... ఆ మధ్య ఒక సారి రెండురోజులపాటు ఆ వాచీని రిపేరు కివ్వవలసి వచ్చినప్పుడు ఎంత విలవిల లాడి పోయింది..

ఉండవలసిన సూట్ కేసు లేదు.

ఉండరాని చేతివాచీ ఉంది.

"సంధ్యా!" అని అరిచాడు రాజగోపాల్ ఆ భవనంలోని గోడలన్నీ వణికాయి.

అందరూ పరుగెత్తుకొచ్చారు...

...ఆ రాత్రి సినిమా కాంట్రాక్టుమీద సంతకం పెట్టి, పదివేల రూపాయలు తన సూట్‌కేసులో పెట్టుకున్న పల్లెటూరిపిల్ల శారదని- నటీమణి సంధ్యని చూసి సంతృప్తిగా నవ్వాడు అసిస్టెంటు డైరెక్టరు రమణ్రావ్. "బెమ్మాండమయిన ఈరోయిన్ని పట్టేసినాం! యావం టావు రవణయ్యా?-" అని మీసం మెలేశారు ప్రొడ్యూసర్‌గారు.

'ఇవాళ వస్తేనే కాంట్రాక్టు! లేకపోతే లేదనేసరికి తప్పుమని పరుగెత్తుకొచ్చింది. హు డబ్బంటే మజాకా? కరెన్సీని చూస్తే కళా గిళా అన్నీ ఎగిరిపోవూ' అని తనకు తెలిసిన జీవిత వ్యాకర ణాన్ని నెమరు వేసుకున్నాడు రమణ్రావు.

వాళ్లని మద్రాసు మోసుకెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లోనే ఇంకోపెట్టెలో బలభద్రం అనబడే దరిద్రుడు ఒక్కుమ్మడిగా కొన్ని వేలకు అధిపతి అయి ప్రయాణం చేస్తున్నట్లు తెలిస్తే సంధ్య కాస్త సంతోషించేదే!

*   *   *

'బస్సులో వస్తున్నా, ఆదివారం - గోపీ'.

—అన్న తంతి శనివారం రాత్రి అందింది.

ఆదివారం సాయంకాలం బస్‌స్టాండ్‌కు వెళ్లాడు లక్ష్మీపతి.

బస్సు వచ్చింది. గోపీ దిగాడు. గోపీ గోపీలా లేడు. కేవలం నడుస్తున్న మనిషిలా కనిపించాడు. ఏం పోగొట్టుకున్నాడు ఈ మూడేళ్ళలో. లక్ష్మీపతి ఆదుర్దాగా మిత్రుడి చెయ్యి పట్టుకున్నాడు.,

గోపీయే అడిగాడు—"ఏమోయ్ బాగున్నావా"

రిక్షాలో ఎవ్వరూ మాట్లాడలేదు. ఇంచుమించు ఊరి చివర ఉన్న లక్ష్మీపతి ఇంటిని చేరాడు.

గోపీ స్నానంచేసి బట్టలు మార్చుకున్నాడు. లక్ష్మీపతి యిచ్చిన వేడి వేడి పాలు తాగి ఈజీచేరులో చేరగిలబడ్డాడు. కళ్ళు మూసుకున్నాడు...

దొంగలాగా నెమ్మదిగా వ్యాపిస్తూంది చీకటి. వరండా గూటిల్లో గుడ్డుదీపం ఉంచి వెళ్ళింది లక్ష్మీపతి కూతురు గీత.

"లక్ష్మీపతి!" అన్నాడు గోపీ.

"ఊ... చెప్పు "

చెప్పాడు గోపీ.

డాక్టరుగా తన విద్యనూ, తన శక్తినీ, డబ్బునీ జనానికోసం వెచ్చిద్దామని వెళ్ళిన ఊరిలో తనకి ఎదురయిన గోడలూ, గోతులూ వివరించాడు. చివరకు పనిమనిషిని ఉంచుకున్నాడన్న అపనిందను గూడా భరించాడు. కాని, గ్రామంలో రెండుపక్షాల మధ్య కొట్లాటలో తల దూర్చ నిష్టంలేని తను వైద్యుడుగా తన ధర్మాన్ని నిర్వర్తించి ఒక ప్రాణాన్ని అతి ప్రయాసతో రక్షించడానికి యత్నించిన తను తను ఉన్న ఇంటికే నిప్పు పెట్టబడిన విషయం వివరించాడు. తన యావదాస్తీ, అంతకన్నా ముఖ్యమయినది తన జీవిత ప్రాతిపదికయే తగలబడి బూడిదయిపోగా.... కేవలం ప్రాణాలతో పరుగెత్తుకొచ్చాడు తను.... "ఎందుకు నాకు ఈ శిక్ష? ఎందుకు ఈ అశాంతి!" అన్న గోపీ కళ్ళల్లో రెండు నీటిబొట్లు నిలిచాయి.

లక్ష్మీపతి లేచి వెళ్ళి గోపీ భుజంమీద చెయ్యి వేశాడు.

"ఇంక లాభంలేదు లక్ష్మీపతీ, లాభంలేదు!.... నేను ఎక్కడికయినా వెళ్ళిపోతాను...." అని తనలో తను మాట్లాడుకుంటున్నట్లు తల ఆడించాడు గోపీనాథ్.

అయిదు నిమిషాల తర్వాత నిశ్శబ్దాన్ని తరిమేస్తూ చెప్పింది లక్ష్మీపతి కంఠం: "మన....మన రాజగోపాలానికి మతి చెడిందిట!"

"ఆ:?!"

తను నమ్మిన మనిషి, పెంచి పెద్ద నటిగా చేసిన వ్యక్తి చిట్టచివరి క్షణంలో తన్నొదిలి పరుగెత్తిపోగా, తోడివాడు డబ్బుతో వెళ్ళిపోగా, మోసమని, దొంగతనమని ప్రజలూ, పత్రికలూ విరుచుకు పడగా, పెద్ద పెద్ద మిత్రులెవరూ ఒక్కవేలు కూడా ఊతగా అందివ్వకపోగా కళగురించి తన తపస్సు తడిసిపోయిన టపాకాయలా ఆరిపోగా—రాజగోపాల్ తన్ను తాను చంపుకోబోయి పట్టుబడి ఆఖరికి ఆస్పత్రిలో పిచ్చివాడుగా చేరిన కథ....ఆచైతన్యంలో ఉన్న గోపీనే ఆశ్చర్యపరిచింది.

"కళ, ప్రజాసేవ, మంచితనం.... అన్నీ ఒట్టి అబద్ధాలు.... లోకమంతా ఉత్త దగాకోర్లు...అంతా మోసం....అంతా అన్యాయం!" అన్నాడు గోపీ కాస్త పెద్దగానే.

ఒక నిముషం గోపీని పరికించాడు లక్ష్మీపతి నెమ్మదిగా పలికాడు.

'గోపీ.... నువ్వు కష్టా లనుభవించావు. కాని తొందర పడుతున్నావు.... పాఠాలు చదివావు కాని, అర్థం చేసుకోలేదు.... మంచితనానికి ప్రతిఫలం సుఖం అన్న తిరుగులేని సిద్ధాంతం ఏమీలేదు.... మనిషి పరిపూర్ణుడు కాడు. అందువలన మంచి చేస్తే చెడు ఎదురవవచ్చు. మోసాలు, అత్యాచారాలు జరగవచ్చు. అంతమాత్రాన అంతా మోసమే అవడానికి వీల్లేదు. నువ్వు వెలిగించుకున్న చిన్న దీపం గాలికి ఆరిపోతే, ప్రపంచానికి చీకటే సహజమని ఎలా అంటావ్?''

''నమ్మిన సత్యం అసత్య మయినప్పుడు? నమ్మిన విలువలు ఎండమావు లయినప్పుడు?''

''అన్ని సత్యాలూ అసత్యాలు కావు. అన్ని విలువలూ ఎండమావులు కావు—కళారాధన గాని, ప్రజాసేవ గాని అపరిపూర్ణులయిన మానవులకు సంబంధించిన విషయాలు. కనుక మనిషికి గల లోట్లు ఈ ఆశయాలకూ ఉండి తీరుతాయి.''

''అంచేత?''

''ఆ విషయం తెలుసుకుని గాలికి ఆరిపోని దీపాన్ని వెలిగించుకోవాలి. ఈ ఆశయా లన్నిటినీ పరమార్థంగా కాక అసత్యం కాని దానికి దారిగా తీసుకోవాలి....''

''ఆ మారిపోని విలువగల సత్యం ఏమిటి?'' అని అడిగాడు గోపీ.

''అది చాలా పాతది. నేను చెబితే నువ్వు నమ్మవు.... పైపెచ్చు నవ్వవచ్చు కూడా....''

''అదీ?''

''దేవుడు!—కాకపోతే అతీతమయిన దివ్యశక్తి. అట్లా చెప్పడం కూడా ఇష్టం లేకపోతే - మనిషిలో లేని, మనిషి ఎప్పుడూ కాంక్షించే పరిపూర్ణత....!''

గోపీ నవ్వలేదు, మాట్లాడలేదు.

లక్ష్మీపతి మాట్లాడుతున్నాడు.

"దానిని గుర్తించి జీవితాన్ని దిద్దుకున్నప్పుడు మిగతా ఆశయా లన్నీ చిన్న చిన్నవిగా పక్కకు తొలగుతాయి. అటువంటప్పుడు వాటిలో ఒకటి రెండు నిరాశ ఇచ్చినా—బలమయిన కేంద్రం ఉంది గనుక ప్రమాదం లేదు. అటువంటప్పుడు బలమూ బలహీనతా, మంచీ మంచి కానిదీ, లాభమూ నష్టమూ, పుట్టడమూ చచ్చిపోవడమూ అన్నీ కూడా ఒక క్రమ పద్ధతిలో, వేని చోటిలో అవి ఇమిడిపోతాయి. అప్పుడు మనస్సుకు—గాలిలో దీపంలా—ఈ ఊగులాట ఉండదు."

ఉవ్వెత్తున లేచిన సముద్రపు అల క్రింద పడి నవ్వుతూ వచ్చి పాదాలను ముట్టుకొని వెళ్ళిపోయినట్లుంది.

- ఇంతసేపూ ఎక్కడా కనబడని బాబు వచ్చి "నాన్నా! భోజనానికి లేవరూ?" అన్నాడు.

ఇద్దరూ కాళ్ళు కడుక్కున్నారు. గీత పీటలువేసి విస్తళ్ళు పరిచింది.

బాబు - పన్నెండేళ్ళవాడు, గీతకు అన్నయ్య - వడ్డించ సాగాడు.

గోపీ మొదటి ముద్దను నోట్లో ఉంచుకోబోతూ ఆగాడు.

అతడి కళ్ళల్లోని ప్రశ్నను చూచి లక్ష్మీపతి నవ్వాడు. "మా ఆవిడకు క్షయ వచ్చిందోయ్.... రెణ్నెల్లనుండి ఆస్పత్రిలో ఉంటోంది. వంట మనదీ, వడ్డన ఇదిగో మావాళ్ళిద్దరిదీను-"

గోపీ దృష్టి.... గది మధ్యగా చిన్న పీటమీద ఉన్న లాంతరు మీద పడింది. విరిగినచోట కాగితం అతుకుపెట్టిన చిమ్నీ గల పాత లాంతరు!.... అయితేనేం, గది కంతటికీ వెలుతురు నిస్తూంది.

"అన్నం తినవోయ్...."

హఠాత్తుగా లక్ష్మీపతి వైపు చూశాడు గోపీ.

నవ్వుతున్న లక్ష్మీపతి నుదుటి మధ్యగా ఉన్న కుంకుమ బొట్టు - మొదటిసారిగా కనబడింది గోపీకి.